నమస్తే తెలంగాణ



## ఎయిర్‌పోర్ట్ మెట్రో రూట్ మార్పు

> మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం అఫిడవిట్ వేయాల్సి ఉన్నదని, అందులో సమగ్ర సమాచారాన్ని అందజేస్తామని చెప్పారు. ధరణిపై అధికారులతో సమీక్ష నిర్వహించి 35 మాడ్యూల్స్‌పై సమగ్రంగా చర్చించామని అన్నారు. వీటిపై అధికారుల వద్ద సరైన సమాచారం లేదని, సమస్త వివరాలతో రావాలని ఆదేశించినట్టు వెల్లడించారు. అధికారులు పూర్తి సమాచారంతో వచ్చిన తర్వాత సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

**ప్రజాభవన్‌లోనే క్యాంపు కార్యాలయం!**

ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంగా జ్యోతిబాపూలే ప్రజాభవన్ సముదాయంలోని క్యాంపు కార్యాలయాన్నే వినియోగించుకోవాలని యోచిస్తున్నట్టు రేవంత్‌రెడ్డి చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ ఉపయోగించిన నివాసాన్ని ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కేటాయించగా అక్కడ ఉన్న జనహిత భవనంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న విషయం తెల్సిందే. ఈ రెండు భవనాల మధ్య సీఎం క్యాంపు కార్యాలయం ఉన్నది. ఇదే భవనాన్ని తాను కూడా ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్టు సీఎం చెప్పారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసాన్నే అధికారిక నివాసంగా ఉపయోగిస్తానని తెలిపారు. ఎంసీహెచ్‌ఆర్డీలో ఖాళీగా ఉన్న ఒకటిన్నర ఎకరాల స్థలంలో త్వరలోనే ఒక భవనాన్ని నిర్మించి సీఎం అధికారిక నివాసంగా ఉపయోగిస్తామని పేర్కొన్నారు. ప్రజాభవన్ సముదాయంలోని గెస్ట్‌హౌజ్‌ను ఎవరైనా మంత్రికి కేటాయిస్తామని లేదంటే స్టేట్ గెస్ట్ హౌజ్‌గా ఉపయోగిస్తామని చెప్పారు. ఈ భవనం పక్కనే ఉన్న పాత క్యాంపు కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. తన కాన్వాయ్‌లోని వాహనాలకు నలుపు రంగు వేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. కొత్త వాహనాలు కొనడానికి తాను వ్యతిరేకినని పేర్కొన్నారు. కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను కూడా తగ్గించాలని చెప్పానని, భద్రత గురించి తనకేమీ భయం లేదని అన్నారు. టీ వర్క్స్, టీ హబ్‌ల లోని కొంతమంది అధికారులు ఇంకా రాజీనామా చేయకపోతే చేయించామని చెప్పారు.

# ఫార్మాసిటీ రద్దుతో గందరగోళం

## చివరి దశలోకి వచ్చిన ఫార్మాసిటీ ఏర్పాటు • దానిని రద్దుచేయాలని కొత్త సర్కారు నిర్ణయం

- ఇప్పటికే 12,300 ఎకరాల భూసేకరణ పూర్తి
- 9,213 ఎకరాలకు మొదటి దశ అనుమతులు
- 48 ఎకరాల్లో రూ.5,809 కోట్లతో అమెజాన్ డాటా సెంటర్
- యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన 350 కంపెనీలు
- ప్రభుత్వ నిర్ణయంతో అన్ని ప్రక్రియలు నిలిపేసిన అధికారులు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గత కొన్ని సంవత్సరాలుగా అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలన్నీ ఒక్కసారిగా నిలిచిపోయాయి. ఫార్మాసిటీ స్థానంలో మెగా టౌన్‌షిప్‌లతో కొత్త సిటీని ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. బుధవారం సీఎం నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకోవడం రంగారెడ్డి జిల్లా పరిధిలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం అక్కడ మెగాసిటీని ఏర్పాటు చేయాలని చూస్తుండగా.. ఎలాగూ ఫార్మాసిటీని రద్దు చేసినందున తమ భూములు తమకిస్తే బాగుంటుందని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

**దేశంలోనే అతిపెద్ద ఫార్మాసిటీ**

రంగారెడ్డి జిల్లా పరిధిలో దేశంలోనే అతి పెద్ద ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇబ్రహీంపట్నం, మహేశ్వరంతోపాటు కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని కడ్తాల్ మండలంలో దాదాపు 19,400 ఎకరాల భూమిని సేకరించాలని గత ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణ ప్రకియను చేపట్టింది. అనంతరం కడ్తాల్ గ్రామ పరిధిలోని భూసేకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొన్నది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద, నక్కర్త, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడెంతోపాటు మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల పరిధిలోని ఉట్లపల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట, తిమ్మాయిపల్లి, మహ్మద్‌నగర్, కందుకూరు, సర్వారావులపల్లి తదితర గ్రామాల పరిధిలోని 14,300 ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు ఇందులో 12,300 ఎకరాల భూసేకరణ కూడా పూర్తవగా, ఇందులో సుమారు 9,400 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉన్నది. మిగిలిన పట్టా, అసైన్డ్ భూములకు ప్రభుత్వం పలు మార్గాల్లో పరిహారం ఇచ్చింది. పట్టా భూములు ఇచ్చిన వారికి ఎకరాకు రూ.18 లక్షలతో పాటు అభివృద్ధి చేసిన 121 గజాల ప్లాటు (ఒక గుంట), ఆ ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. కోర్టును ఆశ్రయించిన కొందరు రైతులకు ఎకరాకు గరిష్ఠంగా రూ.26 లక్షలు వచ్చాయి. అసైన్డ్ భూములు కోల్పోయినవారికి ఎకరాకు రూ.7.50-8.00 లక్షలు ప్రభుత్వం చెల్లించింది. వీరికి ఎకరాకు అభివృద్ధి చేసిన 121 గజాల ప్లాటుతోపాటు ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు నగదు పరిహారం గతంలోనే చెల్లించింది. సేకరించిన భూముల్లోనే 600 ఎకరాల మేర లేఅవుట్‌ను అభివృద్ధి చేసి, భూములు ఇచ్చిన వారికి ప్లాట్లను పంపిణీ కూడా చేశారు.

**ఆ భూములు రైతులకే ఇవ్వాలి: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దుచేస్తే ఆ భూములను తిరిగి రైతులకే ఇవ్వాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఆ భూములను తిరిగి ఇప్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దుచేసి ఆ భూములను రియల్‌ఎస్టేట్ సంస్థలకు కట్టబెట్టి వ్యాపారం చేయాలని చూస్తున్నదని విమర్శించారు. ఈ ప్రాంత అభివృద్ధితో పాటు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం పొల్యూషన్ రహిత ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామంటే మెజార్టీ రైతులు ఒప్పుకుని భూములు ఇచ్చారని తెలిపారు. ప్రజల అభిప్రాయం మేరకే ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ముందుకొచ్చిందని గుర్తుచేశారు.

**ఫార్మాసిటీ రద్దు హర్షణీయం: మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే**

ఫార్మాసిటీ రద్దు హర్షించదగిన విషయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఫార్మాసిటీని వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఇబ్రహీంపట్నం ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఫార్మాసిటీని ఏర్పాటుచేస్తే కాలుష్యంతో ఈ ప్రాంతమంతా తీవ్రంగా నష్టపోయే ప్రమాదమున్నందున ఫార్మాసిటీ పరిసర ప్రాంతాల్లోని మేడిపల్లి, తాటిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్దతో పాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారని అన్నారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఫార్మాసిటీని రద్దుచేస్తామని ప్రకటించిన విధంగా తాము అధికారంలోకి రాగానే ఫార్మాసిటిని రద్దుచేసినట్టు వెల్లడించారు.

### విశాలమైన రహదారులతో అభివృద్ధి

ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో టీఎస్ఐఐసీ విశాలమైన రహదారులు, భూగర్భ డ్రైనేజీ, ఇతరత్రా మౌలిక వసతుల కల్పనతో అభివృద్ధి పనులు చేశారు. కందుకూరు పరిధిలో 180 ఎకరాలు సబ్ స్టేషన్‌కు కేటాయించారు. కొన్నిరోజుల కిందట 30 ఎకరాలకు ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించారు. కాగా ప్రధానంగా 48 ఎకరాలను అమెజాన్ డాటా సెంటర్‌కు ఇచ్చారు. ఇందులో రూ.5,809 కోట్లతో డాటా సెంటర్ ఏర్పాటవుతున్నది. మిగిలిన భూముల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటుకుగాను సుమారు 300-350 కంపెనీలు ముందుకొచ్చినట్టు అధికారులు తెలిపారు. ఆయా కంపెనీలకు భూ కేటాయింపులు చేసే ముందు తీసుకోవాల్సిన అనుమతుల ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు పలు దఫాలుగా కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ క్రమంలో 9,213 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు మొదటి దశ అనుమతుల్లో భాగంగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ కూడా వచ్చినట్టు తెలిసింది. సాధారణంగానైతే తుది దశ అనుమతులు రాగానే ముందుకొచ్చిన కంపెనీలకు భూ కేటాయింపులు చేస్తారు.

### చివరి దశలో కీలక నిర్ణయం

సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల కిందట నిర్వహించిన సమీక్షలో ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ఇప్పటివరకు ఫార్మాసిటీ ఏర్పాటు కోసం చేపట్టిన చర్యలన్నీ నిలిచిపోయాయి. సీఎం నిర్ణయంతో అధికారులు ప్రక్రియలన్నింటినీ నిలిపివేసినట్టు తెలిసింది. ఫార్మాసిటీ కోసం ఇప్పటివరకు 12,300 ఎకరాల భూమిని సేకరించారు. ఆ భూముల్లో మెగా టౌన్‌షిప్‌ల నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. దీనిపై ప్రభుత్వం ప్రణాళిక ప్రకటించాల్సి ఉన్నది. ప్రభుత్వ నిర్ణయంపై ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం సేకరించిన తమ భూముల్ని తిరిగిచ్చేస్తే బాగుంటుందనే కోరుతున్నారు.



హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధేకు జ్ఞాపిక బహూకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

# రాజేంద్రనగర్‌లో హైకోర్టు

- 100 ఎకరాల్లో నూతన భవనం
- జనవరిలో శంకుస్థాపనకు ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): హైకోర్టును రాజేంద్రనగర్‌కు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో 100 ఎకరాల్లో కొత్త భవనం నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, ప్రభుత్వ ముఖ్య అధికారులతో గురువారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత హైకోర్టు భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో కొత్త భవనాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను చీఫ్ జస్టిస్, న్యాయవాదులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రాజేంద్రనగర్ పరిధిలో 100 ఎకరాల్లో హైకోర్టు నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. కొత్త జిల్లాల్లో కోర్టు కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కూడా చొరవ చూపాలని విజ్ఞప్తిచేశారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. జనవరిలో తెలంగాణ హైకోర్టు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇప్పుడున్న హైకోర్టు భవనం వారసత్వ కట్టడం కాబట్టి దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు. భవనాన్ని పునరుద్ధరించి సిటీ కోర్టుకు లేదా ఇతర కోర్టు భవనాలకు వినియోగించుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నిర్మాణాల నిలిపివేతకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో విశ్వ బలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు ప్రభుత్వం భూమి కేటాయించిన వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ప్రభుత్వ వాదన విన్న తర్వాతే తగిన ఉత్తర్వులు ఇస్తామని స్పష్టం చేసింది.

## వచ్చే ఏడాది హైకోర్టు సెలవుల ప్రకటన

- ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర హైకోర్టు వచ్చే సంవత్సరం 2024 సాధారణ, ఐచ్ఛిక, వేసవి సహ ఇతరేతర సెలవు దినాలను ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

**కోర్టు సెలవులు**

- జనవరి 17, 18, 19 సంక్రాంతి సెలవులు
- మే 6-31వరకు వేసవి సెలవులు
- అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 10 వరకు దసరా సెలవులు

పూర్తి వివరాలు ntnews.com లో..

# కిలోమీటరుకు 50 కోట్లు అదనం!


## ఎయిర్‌పోర్టు మెట్రో రూటు మార్పుతో భారీ ఖర్చు

- ఫలక్‌నుమా లేదా ఎల్బీ నగర్ మీదుగా కొత్త అలైన్‌మెంట్
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కొత్త మార్గాలపై అధికారుల దృష్టి
- ఈ రూట్లలో కిలోమీటరుకు 250 కోట్లకుపైగా వ్యయం
- రాయదుర్గం మార్గంతో రూ.200 కోట్ల ఖర్చు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఎయిర్‌పోర్టు మెట్రో రైలు రూటు మార్పుతో ప్రభుత్వంపై కిలోమీటరుకు అదనంగా రూ.50 కోట్ల భారం పడనున్నది. కేసీఆర్ సర్కారు శంకుస్థాపన చేసిన రాయదుర్గం-ఎయిర్‌పోర్ట్ మెట్రో మార్గంతో రూ.200 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, కాంగ్రెస్ సర్కారు ప్రతిపాదించే రెండు రూట్లలో మెట్రో ప్రాజెక్టు నిర్మాణం చేపడితే రూ.250 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. చాంద్రాయణగుట్ట నుంచి మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, పీ7 రోడ్డు మీదుగా విమానాశ్రయం వరకు ఒక అలైన్‌మెంట్. ఇది సుమారు 13 కిలోమీటర్ల వరకు వస్తుంది. బార్కాస్, పహాడీ షరీఫ్, శ్రీశైలం రోడ్డు మీదుగా విమానాశ్రయం వరకు ఇంకో అలైన్‌మెంట్. ఇది దాదాపు 17 కిలోమీటర్ల వరకు వస్తుంది. ఈ రెండు మార్గాల్లో కచ్చితంగా భూసేకరణ చేపట్టాల్సి ఉన్నది. దీంతో ఖర్చు భారీగా పెరగనున్నది. అయితే, రాయదుర్గం మార్గంలో ఔటర్ రింగ్‌రోడ్డు వెంట గతంలోనే మెట్రోకు భూమిని కేటాయించిన నేపథ్యంలో 31 కిలోమీటర్లలో సుమారు కిలోమీటరు మినహా మిగిలిన చోట్ల భూసేకరణ అవసరం లేదు.

**రాయదుర్గం-ఎయిర్‌పోర్ట్ అలైన్‌మెంట్ రద్దు**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం కోసం కేసీఆర్ ప్రభుత్వం రాయదుర్గం-ఎయిర్‌పోర్టు అలైన్‌మెంట్‌ను ఖరారు చేసింది. వాస్తవానికి 2018లోనే ఈ ప్రతిపాదనపై అధ్యయనం



చేయాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఢిల్లీ మెట్రో రైలు బృందం ఈ అలైన్‌మెంట్‌పై అధ్యయనం చేసి 2020లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఇచ్చింది. రూ.6,250 కోట్లతో రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు 31 కిలోమీటర్ల మేర మెట్రో నిర్మాణాన్ని చేపట్టాలని సూచించింది. ఇందుకు అనుగుణంగా గత ఏడాది నవంబరు 27న కేసీఆర్ ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి మెట్రో రైలు ప్రాజెక్టు అధికారులు సర్వే చేసి, మార్క్ కూడా చేశారు. టెండర్ల ప్రక్రియలో భాగంగా నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ కంపెనీలు ముందుకొచ్చాయి. అయితే ఏ ఏజెన్సీని ఎంపిక చేయాలనే నిర్ణయం మాత్రం పెండింగ్‌లో ఉన్నది. రెండ్రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి మెట్రో రైలు ప్రాజెక్టుపై సమీక్ష జరిపి, ఆ ప్రాజెక్టును రద్దు చేశారు. పాతబస్తీ మెట్రోలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఎలాగూ ప్రాజెక్టును చేపడుతున్నందున అక్కడి నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోను పొడిగించాలని సూచించారు. ఎల్బీనగర్ నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా కూడా శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోను కొనసాగించాలని ఆదేశించారు. ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్ నుంచి చాంద్రాయణగుట్ట.. రెండు మార్గాలు ఒకచోట కలిశాక ఒకే మార్గంగా శంషాబాద్ విమానాశ్రయం వరకు అలైన్‌మెంట్‌ను రూపొందించాల్సి ఉన్నది. ఇందులో తక్కువ వ్యయంతో అయ్యే మార్గాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు.

### రియల్ ఎస్టేట్ పరిశ్రమకు అండగా ఉంటాం

- క్రెడాయ్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి క్రెడాయ్ ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. గురువారం హైదరాబాద్ క్రెడాయ్ ప్రతినిధి బృందం సీఎంను కలిసి అభినందనలు తెలిపింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్థిరాస్తి రంగాభివృద్ధికి అండగా నిలవాలని కోరారు. పరిశ్రమకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమం లో హైదరాబాద్ క్రెడాయ్ అధ్యక్షుడు వీ రాజశేఖర్‌రెడ్డి, ప్రెసిడెంట్-ఎలక్ట్ జైదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కోటి, రాంబాబు, మురళీమోహన్, సంయుక్త కార్యదర్శులు క్రాంతికిరణ్‌రెడ్డి, నితీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లకు ఒకటో తేదీనే జీతాలివ్వాలి

### సీఎం రేవంత్‌రెడ్డికి ఎస్టీయూ వినతి

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, జీ సదానందం గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు విన్నవించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఉపాధ్యాయులకు వెంటనే ఉద్యోగోన్నతులు కల్పించి, బదిలీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో తొలిమెట్టు, ఉన్నతి వంటి కార్యక్రమాలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**స్పౌజ్ పాయింట్లు రద్దు చేయాలి...**

ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను రద్దు చేయాలని, నాన్ స్పౌజ్ టీచర్ల బదిలీలకు తొలి ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ (టీఎన్‌ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోకల శేఖర్, సక్కుబాయి కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి టీఎన్‌ఎస్టీఏ నాయకులు శుభాకాంక్షలు తెలిపి, సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కృష్ణకుమారి, రూపారాణి, ముఖ్య నాయకులు సిద్ధం శ్రీనివాస్, వెంకటయ్య, పద్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి సావిత్రి ఉన్నారు.

**ఉద్యోగోన్నతులు కల్పించాలి**

తెలంగాణలోని తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు- తెలంగాణ రాష్ట్రం(ఆర్‌యూపీపీటీఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీ జగదీశ్, ఎస్ నర్సింహులు కోరారు. ఈ విషయమై గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నూతన తెలంగాణ భాషా విధానాన్ని ప్రవేశపెట్టాలని, పాఠశాలల్లో వారానికి 6 హిందీ క్లాసులు నిర్వహించాలని, పాఠశాల విద్యలో నాలుగో తరగతి నుంచే హిందీని ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని గ్రేడ్-2 భాషా పండిత వ్యవస్థను రద్దుచేసి అందరినీ స్కూల్ అసిస్టెంట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించారు.

### బీసీ కులగణనకు ప్రతిపక్షాలు ఏకమవ్వాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, డిసెంబర్14 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణన కోసం ప్రతిపక్షాలన్నీ ఒక్కటై కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణ య్య కోరారు. కులగణన చేపట్టాలని గురువారం ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద బీసీ సంఘాలు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ విషయంపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలని, కేంద్ర ప్రభుత్వం దిగిరాకపోతే సమావేశాలను బహిష్కరించాల ని పిలుపునిచ్చారు. కులగణనతో కులా ల జనాభా ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయని, వారి జనాభా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. దశాబ్దాలుగా బీసీ కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇక సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మారేశ్, మహేందర్, కర్రి వేణుమాధవ్, నీలా వెంకటేశ్, అనంతయ్య, అంగిరేకుల వరప్రసాద్, రామకృష్ణ, పృథ్వీగౌడ్, పద్మలత పాల్గొన్నారు.

# 9 వేల కోట్ల ఆస్తి సురక్షితం

- 181 ఎకరాల భూమిని కాపాడిన కేసీఆర్ సర్కార్
- శంషాబాద్ భూములు హెచ్‌ఎండీఏవే
- రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు
- నకిలీ ఉత్తర్వులతో భూకబ్జాకు కుట్ర
- కుట్ర భగ్నం చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- కోర్టు తీర్పు, పత్రాలు నకిలీవని స్పష్టం
- ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తప్పుడు రికార్డులు సృష్టించి ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించిన అక్రమార్కుల కుట్రను బీఆర్‌ఎస్ ప్రభుత్వం భగ్నం చేసింది. సుమారు రూ.9000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల పాలు కాకుండా రక్షించింది. నకిలీ కోర్టు ఉత్తర్వులతో హైకోర్టునే బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించిన కుట్రను ఉన్నత న్యాయస్థానంలోనే బట్టబయలు చేసి విజయం సాధించింది. శంషాబాబాద్‌లోని 181 ఎకరాల భూమి హెచ్‌ఎండీఏదేనని గత ప్రభుత్వం చేసిన వాదనను ఆమోదిస్తూ వేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో హెచ్‌ఎండీఏకు చెందిన 181 ఎకరాల భూముల్లో దాదాపు 50 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు ఆక్రమణదారులు కుట్రలకు తెరలేపారు. సంబంధంలేని సర్వే నంబర్లను చూపి ఆ భూముల్లో పొజిషన్ కోసం ప్రయత్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్, హెచ్‌ఎండీఏ ఎస్టేట్, లీగల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులు భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ఏడాది కాలంగా హైకోర్టులో తమ వాదనలు వినిపిస్తూ వచ్చారు. హెచ్‌ఎండీఏ అధికారిక లెక్కల ప్రకారం ఒక్కో ఎకరం విలువ రూ.50 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కేసులో ఆక్రమణదారులు నకిలీ పత్రాలు సృష్టించిన విషయాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెలుగులోకి తెచ్చింది. 1997లో హైకోర్టులో దాఖలైనవి రెండు వేర్వేరు వ్యాజ్యాలు అని, వాటిలో మధ్యంతర ఉత్తర్వులు కూడా నకిలీవేనని పేర్కొంది. దీనిపై స్పందించిన హైకోర్టు, జ్యుడీషియల్ రిజిస్ట్రీతో నివేదిక తెప్పించుకుంది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ ప్రస్తావించిన అంశాలన్నీ వాస్తవమేనని రిజిస్ట్రీ సీల్డ్ కవర్‌లో నివేదిక ఇచ్చింది. ఉభయపక్షాల వాదనలు విన్న హైకోర్టు గత నెల 18న తీర్పును వాయిదా వేసింది.

**పిటిషన్లు డిస్మిస్**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ గ్రామంలోని సర్వే నంబర్ 725/21లో 7 ఎకరాల 31 గుంటలు, సర్వేనంబర్ 725/23లోని 10 ఎకరాల 07 గుంటలు, సర్వేనంబర్ 725/24లో 12 ఎకరాల 34 గుంటలు.. సుమారు 30 ఎకరాల భూమిని తన పూర్వీకులు పైగా (సైన్యం నిర్వహణకు పరిహారంగా నిజాం నవాబ్ మంజూరు చేసిన భూమి) యజమానుల నుంచి కొనుగోలు చేసినట్టు హైదరాబాద్ పాతబస్తీలోని ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ యాహియా ఖురేషీ, వట్టెపల్లికి చెందిన మహ్మద్ మొయినుద్దీన్ వేర్వేరుగా దాఖలు చేసిన రెండు వ్యాజ్యాలను హైకోర్టు కొట్టివేసింది. అక్కడి 181 ఎకరాల భూమి హెచ్‌ఎండీఏదేనని ప్రభుత్వం చేసిన వాదనను ఆమోదించింది. 2007లోనే తెలంగాణ రాష్ట్రం ఉన్నట్టుగా పిటిషనర్లు బోగస్ డాక్యుమెంట్లను సమర్పించడం మొదలుకొని 1990 సెప్టెంబర్ 4 నాటి హైకోర్టు ఉత్తర్వుగా పేర్కొంటూ1992లో టైప్ చేసిన ఆర్డర్ కాపీ, పిటిషనర్ సమర్పించిన ఇతర పత్రాలు బోగస్‌వేనని పేర్కొంది. పిటిషనర్లు ఉత్తర్వులు పొందేందుకు అర్హత లేదని, ఆ భూములన్నీ ప్రభుత్వానివేనని స్పష్టం చేసింది. 2007, 2012 సంవత్సరాల్లో పంచాయతీ జారీ చేసిన పన్ను రశీదులు నకిలీవేనని పేర్కొంది. 2007 నాటికి తెలంగాణ రాష్ట్రమే ఏర్పాటు కాలేదు. శంషాబాద్ గ్రామం రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉంటే, హైదరాబాద్ జిల్లాలో ఉన్నట్టుగా పిటిషనర్లు రసీదును సమర్పించారు. ప్రభుత్వం ఈ విషయాలపై కూలంకషంగా వివరించడంతో.. హైకోర్టు జ్యుడీషియల్ రిజిస్ట్రీతో దర్యాప్తు చేయించుకొని సీల్డ్ కవర్‌లో నివేదిక తెప్పించుకుని విచారణను పూర్తిచేసింది. హైకోర్టులో పిటిషనర్లు 1997లో వ్యాజ్యాలనే దాఖలు చేయలేదని, 1998లో హైకోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని తెలిపింది. హైకోర్టు ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకపోయినా తప్పుడు పత్రాలతో కోర్టునే మోసం చేయాలని ప్రయత్నించారని పేర్కొంది. ఈ మేరకు 54 పేజీల తీర్పును వెలువరించింది.

**మహా కుట్రభగ్నం**

ప్రభుత్వ భూమిని తొలుత 30 ఎకరాలు ఆక్రమించి, ఆ తర్వాత మరో 150 ఎకరాలను కూడా తమ వశం చేసుకునేందుకు పిటిషనర్లు కుట్ర పన్నారు. హైకోర్టు 1998లో వెలువరించినట్టుగా పిటిషనర్లు సమర్పించిన సర్టిఫైడ్ కాపీల్లో నాటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ డీ పట్నాయక్ పేరును ఎండీ పట్నాయక్‌గా పేర్కొన్నారు. ఎండీ పట్నాయక్ పేరు గల వ్యక్తి ఇప్పటివరకు ఉమ్మడి ఏపీ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేయలేదు. ఆ కాలంలో జస్టిస్ ఎన్‌డీ పట్నాయక్ న్యాయమూర్తిగా పనిచేశారు. పిటిషనర్లు సమర్పించిన హైకోర్టు తీర్పు సర్టిఫైడ్ కాపీ నకిలీది. 1997లో ఆ రెండు పిటిషన్లు దాఖలే కాలేదు అని ఏజీ బీఎస్ ప్రసాద్ చేసిన వాదనను హైకోర్టు ఆమోదించింది.

### ఇదీ నేపథ్యం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ట్రక్కు టెర్మినల్ నిర్మాణ కోసం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 661, 662, 721, 725ల్లో ప్రభుత్వం 181ఎకరాలను 1987లో సేకరించింది. ఈ భూములపై హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ)కు సర్వహక్కులు ఉన్నాయి. దాదాపు 20 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ ఓ నర్సరీని కలిగి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు ఎకరాల భూమిని ఆ పరిసరాల ప్రజల సౌకర్యార్థం వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌కు కేటాయించారు. కొత్తగా మున్సిపాలిటీలను ఏర్పాటుచేసిన నేపథ్యంలో శంషాబాద్ మున్సిపల్ ఆఫీసు నిర్మాణం కోసం 30 గుంటల భూమి కేటాయించారు. ఈ మేరకు అప్పట్లో అవార్డు (నంబర్ 1/1990, ఫైల్ నంబర్ ఐఏ 84/86)ను కూడా జారీ అయింది. వీటిలో 'పైగా' భూములు కూడా ఉన్నాయి. 2011లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పట్టాదారులకు ప్రభుత్వం పరిహారం కూడా చెల్లించింది. అందులో 30 ఎకరాల విషయంలో తమకు పరిహారం అందలేదంటూ 2021లో పిటిషన్లు దాఖలయ్యాయి. తప్పుడు తీర్పుల ప్రతులతో పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వులు కూడా పొందారు. ఆ ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోవడంతో కోర్టు ధిక్కార వ్యాజ్యాలను కూడా దాఖలు చేశారు. 1998లో హైకోర్టు పిటిషనర్లకు ఏవిధమైన ఉత్తర్వులు ఇవ్వలేదని తాజా తీర్పు ద్వారా వెల్లడైంది.

## 21న చలో ఢిల్లీ

- టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



ముషీరాబాద్, డిసెంబర్ 14: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ 21న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కమిటీల పేరిట ప్రధాని మోదీ కాలయాపన చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు చలో ఢిల్లీకి పిలుపునిచ్చినట్టు చెప్పారు. వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి పదేండ్లుగా కాలయాపన చేస్తున్న బీజేపీ తీరు ఆక్షేపనీయమని, మాదిగలను మోసం చేయడానికే మరోమారు కమిషన్ ఏర్పాటు అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ ద్వారానే మాదిగలు, ఉపకులాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ మీసాల మల్లేశ్, హుస్సేన్, యాదగిరి, వరలక్ష్మి, లక్ష్మి, నందకిశోర్, మహేశ్, శాంతికిరణ్, కొల్లూరి వెంకట్, చందు తదితరులు పాల్గొన్నారు.